క్లుప్తంగా

హేతువాద జీవనాడి రావిపూడి



రావిపూడి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రగతిశీల వాదులు

ఐ.పోలవరం: హేతువాద భావజాల రచనా రంగంలో అంతర్జాతీయ ప్రాధాన్యత కలిగిన రావిపూడి వెంకటాద్రి మరణం తీరని లోటని పలువురు ప్రగతిశీల వాదులు పేర్కొన్నారు. ఐపోలవరంలో శుక్రవారం ప్రజ్ఞాసాహితి ఆధ్వర్యంలో నిర్వహించిన రావిపూడి సంతాప సభలో పాల్గొని రావిపూడి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. శాస్త్రీయ ఆలోచనా విధానానికి మానవవాద తత్వానికి ముడి వేసిన మహారచయిత రావిపూడి అని కొనియాడారు. పుల్లెపు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ముమ్మిడివరంలో నిర్వహించిన పలు సభలకు మూడు సార్లు వచ్చి ప్రసంగించారని గుర్తుకు చేసుకొన్నారు. 1922లో జన్మించిన రావిపూడి ఈ నెల 21న మరణించారని, వారి ఆశయాలను మరింత ముందుకు తీసుకొని వెళ్తామని ప్రతిజ్ఞ చేశారు. సీహెచ్ విద్యాసాగర్, ఏఎస్ఎన్ ,మూర్తి, మహేష్ ఉన్నారు.

రహదారిని ధ్వంసం చేశారంటూ ఆందోళన



పొక్లెయిన్ ధాటికి దెబ్బతిన్న కూనవరం రహదారి

ఉప్పలగుప్తం: మండలంలోని కూనవరంలో పంటకాలువ బాగు చేసే క్రమంలో ఇటీవలే నిర్మించిన బీటీ రోడ్డును ధ్వంసం చేశారంటూ స్థానికులు ఆందోళన చేశారు. ఇరిగేషన్ అధికారులు ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన పూడిక తీత పనుల కోసం ఇనుప పట్టాలతో ఉన్న పొక్లెయిన్ తీసుకువచ్చారు. ఎటువంటి రక్షణా లేకుండా పొక్లెయిన్‌ను రోడ్డుపై నడపడంతో రూ.కోట్లతో నిర్మించిన రహదారి ఛిద్రమైందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారి ద్వారా ఏడు ప్రధాన గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తారన్నారు. రోడ్లు నిర్మించిన కొద్ది నెలలకే అధికారుల నిర్లక్ష్యంతో పాడవుతున్నాయని వాపోతున్నారు.

వెటర్నరీ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ



యానాం వెటర్నరీ ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: స్థానిక ప్రభుత్వ వెటర్నరీ ఆసుపత్రిని ఆర్ఏఓ మునిస్వామి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రికి సంబంధించి పలు అంశాలపై రైతులు, సిబ్బందితో మాట్లాడారు. ఆసుపత్రిలో పనిచేసే వైద్యురాలికి పీజీ సీటు రావడంతో ఆమె వెళ్లిపోయారని అప్పటి నుంచి ఆమె స్థానంలో ఎవరిని నియమించలేదని, పశువుల వైద్యానికి ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణం వెటర్నరీ డాక్టర్‌ను నియమించాలని రైతులు ఆర్ఏఓను కోరారు. పశువుల మందులు వచ్చేలా ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రిని శుభ్రం చేయడానికి అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన సిబ్బందిని వేయాలని కోరారు.

కార్మికుల కోసం అసువులు బాసిన మురళీమోహన్



సీఐటీయూ నేత శేషుబాబ్జి

యానాం: కార్మికుల హక్కుల కోసం పోరాడి ఆఖరికి ప్రాణాలు సైతం కోల్పోయిన కార్మికోద్యమ నేత, రీజెన్సీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు దివంగత మచ్చా మురళీమోహన్ అని పలువురు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ మున్సిపల్ కల్యాణ మంటపంలో మచ్చా మురళీమోహన్ 11వ వర్ధంతిని పురస్కరించుకుని కార్మికుల సమావేశం జరిగింది. అంతకముందు రీజెన్సీ ఫ్యాక్టరీ గేటు వద్ద మురళీమోహన్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీఐటీయూ నేత దువ్వా శేషుబాబ్జి మాట్లాడుతూ రీజెన్సీ కార్మికుల పోరాటం దేశ కార్మికోద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. కార్మికుల పక్షాన పోరాడిన మాగాపు సుబ్బారావు, న్యాయవాది భీమారావు, నాయకులు విల్సన్ పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌కు నివాళి

యానాం: రీజెన్సీ సిరామిక్స్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్(ఆపరేషన్స్) దివంగత కేసీ చంద్రశేఖర్ 11వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక రీజెన్సీ పబ్లిక్‌స్కూల్ ఆవరణలో సంస్మరణను ఏర్పాటు చేశారు. ఈ సదర్భంగా ముఖ్యఅతిధిగా విచ్చేసిన యానాం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఈలప్రోలు విష్ణువర్ధనరావు తదితరులు చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్‌సీఎల్ మేనేజర్ రాజేంద్రప్రసాద్, హెచ్ఎం ప్రసాదరావు, ప్రిన్సిపాల్ మార్తాండప్రసాద్ పాల్గొన్నారు.

రీజెన్సీ పరిశ్రమ పునః ప్రారంభమయ్యేనా?

- వందలాది కార్మికుల ఎదురుచూపు
- దుర్ఘటనకు 11 ఏళ్లు పూర్తి



మూతపడ్డ రీజెన్సీ సిరామిక్స్ పరిశ్రమ

యానాం: ఆ ప్రాంతమంతా వందలాదిమంది కార్మికుల బూట్ల చప్పుళ్లు..భారీ వాహనాల రణగొణ ధ్వనులు...షిఫ్ట్..షిఫ్ట్‌కు సైరన్ మోతతో తమ వాచ్‌లను చూసుకుని.. పరిగెత్తే హడావుడి..మరోపక్క సెక్యూరిటీగార్డుల తనిఖీలు..ఎగుమతుల కోసం వందలాది లారీలు ఇవీ ఒకప్పుడు రీజెన్సీ సిరామిక్స్ ఫ్యాక్టరీలో దృశ్యాలు. కాని విధి విచిత్రం వేలాది మంది కార్మికులకు ఉపాధినిచ్చిన సంస్థ నేడు చిట్టడవిని తలపిస్తోంది. 2012 సంవత్సరం జనవరి 27న ఫ్యాక్టరీలో జరిగిన దుర్ఘటన ఒక్క రోజులో కార్మికుల జీవిత గమనాన్నే మార్చేసింది. దుర్ఘటన జరిగి 11ఏళ్లు అవుతున్నప్పటికీ కార్మికులంతా ఫ్యాక్టరీ తెరుస్తారనే ఆశలతో ఇంకా ఎదురు చూస్తున్నారు.

1983లో పరిశ్రమ స్థాపన

రీజెన్సీ పరిశ్రమను ఇటలీలోని ప్రఖ్యాత వెల్‌కో అనే సంస్థతో కలిసి సంయుక్తంగా యానాంలోని మెట్టకూరులో డాక్టర్ జీఎస్ నాయుడు నాయకత్వంలో స్థాపించారు. రోజుకు నాలుగువేల స్క్వేర్‌మీటర్లు టైల్స్ తయారీ నుంచి ఏకంగా రోజుకు నాణ్యతగల 44వేల స్క్వేర్‌మీటర్లు తయారు చేసే స్థాయికి చేరుకుంది. ఆ విధంగా దేశవ్యాప్తంగా 700 మంది డీలర్లకు, మధ్య ఆసియా, ఆఫ్రికా ఖండాలతో పాటు 40 దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంది.

వందలాది మందికి ఉపాధి

పరిశ్రమలో యానాం పరిసర ప్రాంతాలకు చెందిన వందలాదిమంది కార్మికులు ఉపాధి పొందడంతో పాటు మరికొన్ని అనుబంధ పరిశ్రమల నిర్మాణంతో వేలాదిగా ఉపాధి పొందేవారు. రీజెన్సీ ఫ్యాక్టరీకి అనుబంధంగా యానాం పరిసర ప్రాంతాల్లో చిన్న తరహా పరిశ్రమలను నెలకొల్పడంతో అక్కడ సైతం కొందరు ఉపాధి పొందేవారు. అనంతరం జరిగిన దుర్ఘటనలో కార్మికుల నుంచి కార్మికనేత మచ్చా మురళీమోహన్‌ను కోల్పోతే, యాజమాన్యం నుంచి రీజెన్సీ వైస్‌చైర్మన్ కె.చంద్రశేఖర్‌ను కోల్పోయారు. కేసులపై కోర్టుల్లో విచారణ నడుస్తోంది. ఫ్యాక్టరీ నష్టానికి సంబంధించి ఇన్సూరెన్స్ సైతం కోట్లాది రూపాయలు రావాల్సివున్నప్పటికీ రాలేదని అంటున్నారు. దీంతో ఫ్యాక్టరీ పునఃప్రారంభం కాకపోవడానికి అడ్డంకిగా ఉందని భావిస్తున్నారు.

రీజెన్సీ కార్మికుల ఇళ్ల పట్టాలకు స్థలం కేటాయింపు ఫ్యాక్టరీ నిలిచిపోయిన తర్వాత కార్మికులు సుదీర్ఘపోరాటం చేశారు. తీవ్రంగా నష్టపోయిన తమకు నష్ట పరిహారం ఇవ్వాలంటూ న్యాయపోరాటం చేశారు. పుదుచ్చేరి లేబర్‌కోర్టును, ప్రభుత్వాన్ని ఆశ్రయించారు. ఎట్టకేలకు దొమ్మేటిపేటలో సంస్థకు చెందిన 29 ఎకరాలను కేటాయించి సీనియారిటీ ప్రాతిపదికన పలువురికి మూడు, రెండు సెంట్ల చొప్పున నివేసనా స్థలాలను కేటాయించి ఆ ప్రాంతాన్ని నివాసయోగ్యం తీర్చిదిద్దుతున్నారు.

ఫ్యాక్టరీ దుర్ఘటనతో ఆర్థికంగా కుదేలైన యానాం

రీజెన్సీఫ్యాక్టరీ దుర్ఘటన అనంతరం యానాం ప్రాంతం ఆర్థికంగా కుదేలైంది. నిత్యం వేలాదిమంది కార్మికులతో కళకళలాడటంతో వ్యాపారాలు సైతం అభివృద్ధి పథంలో నడిచాయి. నిత్యావసర దుకాణాలు, వస్త్ర దుకాణాలు, హోటల్స్, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, వాహనరంగ దుకాణాల్లో వ్యాపారం జోరుగా సాగింది. ఇండ్ల అద్దెలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థుల చేరిక, కోట్లాది రూపాయల మేర భూముల లావాదేవీలు జరగడంతో ఒక వెలుగు వెలిగింది.

వ్యాపారాలతో కళకళలాడుతుంది



ఫ్యాక్టరీని తెరిస్తే వేలాది మంది కార్మికులకు ఉపాధి తోపాటు, యానాం ప్రాంతం ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది. మళ్లీ వ్యాపారాలతో కళకళలాడుతుంది. ఈ సమస్యపై పుదుచ్చేరి ప్రభుత్వంతో అనేకసార్లు మాట్లాడాను. ఫ్యాక్టరీని తెరవాలని యాజమాన్యంతో అనేకసార్లు చర్చించాను, తెరుస్తారనే ఆశతో ఉన్నాను

– ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, యానాం

లలితకుమారికి ఉత్తమ సేవా పురస్కారం



కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎంపీ అనురాధ నుంచి అవార్డు అందుకుంటున్న లలిత కుమారి

అమలాపురం టౌన్: బోడసకుర్రు టిడ్కో ఇళ్లను పర్యవేక్షిస్తున్న ఏపీ టిడ్కో హౌసింగ్ స్పెషలిస్ట్ దొండపాటి లలితకుమారికి ఉత్తమ సేవా పురస్కారం లభించింది. అమలాపురంలో గురువారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎంపీ అనురాధ చేతల మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు. సేవా పురస్కారం పొందిన లలిత కుమారిని పలువురు అభినందించారు.

దాహార్తి తీర్చేందుకు ప్రాధాన్యం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ

ఐ.పోలవరం: నియోజకవర్గంలో దాహార్తి తీర్చేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, ఇందుకోసం రూ.150 కోట్లు ఖర్చు చేస్తామని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని గుత్తినదీవి గ్రామంలో శుక్రవారం ఓఎన్‌జీసీ నిధులు రూ.2.65కోట్లతో ఏర్పాటు చేసే ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్ పనులకు ఆయన భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో మంచినీటి సమస్యకు చెక్ పెట్టేందుకూ రూ.150 కోట్ల ఖర్చుతో మంచి నీటి పైపు లైన్లు, 80 ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. వచ్చే వేసవికి పూర్తి స్థాయిలో తాగునీటి సమస్య తీరుతుందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు, ఎంపీపీ మెర్ల రాణి మిరియం జ్యోతి, పార్టీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతి రాజు, నల్లా సుదర్శన్, మెండా వెంకన్నబాబు, చిక్కాల సత్తిబాబు, మెర్ల చిన్నా, విత్తనాల శ్రీనివాసరావు, రాజు మాస్టారు పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

ముమ్మిడివరం: విద్యప్రమాణాలు పెంపొందించేందుకు ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మండలంలో పదో తరగతి విద్యార్థులకు సమకూర్చిన జగనన్న విద్యాభారతి పుస్తకాలను ఎమ్మెల్యే పొన్నాడ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ముమ్మిడివరం, కాట్రేనికోన జెడ్పీటీసీ సభ్యులు కుడిపూడి శంకరరావు, నేల కిశోర్, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ కోలా గంగాభవానీ, పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, జగతా పద్మనాభం, కోలా బాబ్జీ, బొంతు బుజ్జిబాబు పాల్గొన్నారు.

ఆవుకు వింత దూడ జననం



తలపై కంతితో జన్మించిన వింత దూడ

ఉప్పలగుప్తం: మండలంలోని సన్నవిల్లి గ్రామంలో చిక్కం హరిప్రసాద్‌కు చెందిన సూడి ఆవుకు శస్త్ర చికిత్స చేసి వింత దూడను బయటకు తీశారు. ఆవు గురువారం ఉదయం నుంచి ప్రసవ వేదనతో బాధ పడుతోంది. విషయం గమనించిన రైతు హరిప్రసాద్ శుక్రవారం పశువైద్యులను సంప్రదించారు. చెయ్యేరు, మాగం పశు వైద్యులు రమేష్, రేవంత్ నెలలు నిండిన ఆవును పరీక్షించి గర్భంలో ఉన్న దూడకు తలపై పెద్ద కంతి ఉందని సాధారణ ప్రసవం జరగదని నిర్ధారించారు. వెంటనే ఆవుకు శస్త్ర చికిత్స చేసి దూడను బయటకు తీశారు. దూడకు తలపై ఉన్న కంతిని శస్త్ర చికిత్స ద్వారా తొలగించారు. దూడ కొన్ని గంటలు జీవించి చనిపోయినప్పటికీ, ఆవు సురక్షితంగా కోలుకుంటుందని రైతు తెలిపారు. జన్యు పరమైన లోపం వల్ల ఇటువంటి కంతి వచ్చే అవకాశం ఉందని, ఈ నీటి కంతిని హైడ్రో సెఫిలాస్ అంటారని వైద్యులు తెలిపారు. ఎల్ఎస్ఏ సత్యనారాయణ, సహాయక సిబ్బంది దార్లంక కిరణ్, గుద్దటి వెంకటేష్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



ఇంజరంలో స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

తాళ్లరేవు: పదో తరగతి విద్యార్థుల కోసం జిల్లా ప్రజాపరిషత్ ఆధ్వర్యంలో రూపొందించిన విద్యాభారతి స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం 292 మందికి పంపిణీ చేశారు. ఇంజరం, పిల్లంక, నీలపల్లి జెడ్పీ హైస్కూల్స్‌లో జరిగిన కార్యక్రమాల్లో మెటీరియల్‌ను ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్‌సాగర్ విద్యార్థులకు అందజేశారు. ఇంజరం–141, నీలపల్లి–97, పిల్లంక–54 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీవో చింతామోహనకృష్ణ, ఎంఈవో మంగాయమ్మ, నాయకుడు వైఎస్సార్ సీపీ నేత రాయుడు గంగాధర్, సర్పంచ్‌లు ముద్దన వెంకట శివరాంప్రసాద్, చిట్టూరి నాగమణి, రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

చికిత్స కోసం రూ.5వేల సహాయం

తాళ్లరేవు: మండల పరిధిలోని ఇంజరం గ్రామానికి చెందిన దంగేటి పరశురామ్ ఇటీవలి రోడ్డు ప్రమాదానికి గురై తలకు తీవ్ర గాయమై చికిత్స పొందుతున్న నేపథ్యంలో అతని వైద్యఖర్చుల కోసం శుక్రవారం స్థానిక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. కాకినాడ న్యూరోస్టార్ ఆసుపత్రిలో క్షతగాత్రుడికి ఆపరేషన్ నిర్వహించారని ఆయన తెలిపారు.

భూపత్రాల పంపిణీ వేగవంతం చేయాలి

తాళ్లరేవు: జగనన్న శాశ్వత భూహక్కు భూరక్షరీ సర్వేకు సంబంధించి తాళ్లరేవు తహసీల్దార్ ఆఫీసులో కాకినాడ ఆర్డీవో బీవీ రమణ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాళ్లరేవు మండలంలో రీసర్వే పూర్తయిన గ్రామాలలో ప్రస్తుతం ఇప్పటివరకు 2,053 భూహక్కు పత్రాల పంపిణీ చేసినట్లు తెలిపారు. కాకినాడ రెవెన్యూ డివిజన్‌లో సుమారు 55,890 భూహక్కు పత్రాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ ఎం.సూరిబాబు, డీటీ పద్మ పాల్గొన్నారు.

పొలాల్లోకి ఉప్పునీరు రాకుండా గండ్లు పూడ్చివేత



పొలాల్లోకి ఉప్పునీరు రాకుండా జేసీబీతో గండ్లు పూడ్చుతున్న దృశ్యం

సాక్షి ఇంపాక్ట్

అల్లవరం: బెండా కాలువ –4 పొడవునా ఆక్రమణలు, పూడికలతో నిండిపోయి పంట పొలాల్లోకి ఉప్పునీరు ఎదురెక్కి రైతులు రెండేళ్లుగా వరినాట్లు వేయని పరిస్థితి నెలకొంది. దీనిపై నెల 23న 'పంట పొలాల్లోకి ఉప్పునీరు' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బెండకాలువ పొడవునా పూడిక తీసేందుకు రూ.5 లక్షలు నిధులు మంజూరు చేశారు. రెవెన్యూ అధికారులు ఆధ్వర్యంలో కొమరగిరిపట్నం శివారు ఊసర వ్యవసాయ క్షేత్రాల్లోకి ఉప్పునీరు రాకుండా జేసీబీ సహాయంతో పైపులు తొలగించి గండ్లు పూడ్చి వేశారు. శనివారం రెవెన్యూ, ఇరిగేషన్, డ్రైన్, వ్యవసాయ శాఖాధికారులు ఊసర వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి తదుపరి చర్యలు తీసుకుంటారని గ్రామస్తులు తెలిపారు.

ఉద్యోగులకు ఈపీఎఫ్‌పై అవగాహన



కాకినాడ ఈపీఎఫ్ అధికారి రామకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న కోకో ఫెడ్ ప్రతినిధులు

అమలాపురం రూరల్: స్థానిక కిమ్స్ ఆస్పత్రి ఉద్యోగులకు శుక్రవారం ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్)పై అవగాహన సదస్సు నిర్వహించారు. కిమ్స్ మానవ వనరుల విభాగం జనరల్ మేనేజర్ రాధా మనోహర్ పర్యవేక్షణలో జరిగిన ఈ సదస్సుకు కాకినాడ ఈపీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ కె.రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈపీఎఫ్ అకౌంట్ నుంచి కుటుంబ సభ్యుల విద్య, వైద్యం, వివాహ అవసరాల కోసం, గృహ నిర్మాణ ఖర్చుల నిమిత్తం రుణం తీసుకునే అవకాశం ఉందన్నారు. ఆన్‌లైన్‌లో ఈ–కేవైసీ సమర్పించే సౌకర్యం, మొబైల్ నంబర్ మారినప్పుడు కొత్త నంబర్ నమోదు చేసుకునే పద్ధతిపై అవగాహన కల్పించారు. ఉద్యోగులకు పీఎఫ్‌పై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కిమ్స్ సీఈవో డాక్టర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కోనసీమలో ఈపీఎఫ్ కార్యాలయం ఏర్పాటు చేయాలి

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఈపీఎఫ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోనసీమ కన్స్యూమర్స్ ఫెడరేషన్ (కోకో ఫెడ్) చైర్మన్ అరిగెల బలరామమూర్తి ఆధ్వర్యంలో ఈపీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ రామకృష్ణకు వినతి పత్రం అందించారు. కోకో ఫెడ్ ప్రధాన కార్యదర్శి ఆదిత్య కిరణ్, పీఎఫ్ విశ్రాంత అధికారి అద్దంకి అమరేశ్వరరావు, సహకార శాఖ విశ్రాంత అధికారి బీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పందుల పెంపకందారులకు మందుల పంపిణీ



పందుల పెంపకందార్లకు మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ విజయారెడ్డి

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం, పరిసర గ్రామాల్లో వైరల్ వ్యాధితో పందులు మృత్యువాత పడుతున్నాయి. ఈ నేపథ్యంలో పశుసంవర్ధక శాఖ అధికారులు శుక్రవారం పట్టణంలో పందుల పెంపకం ప్రాంతాలకు వెళ్లి క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జయపాల్ పర్యవేక్షణలో సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయారెడ్డి వైద్య బృందం స్థానిక మార్కెట్ తదితర ప్రాంతాల్లో పర్యటించింది. పందులకు సోకుతున్న వైరస్‌ను నిరోధించేందుకు అవసరమైన రోగ నిరోధక శక్తి మందులను పెంపకందార్లకు పంపిణీ చేశారు. ఇప్పటికే మరణించిన పందులకు పోస్టుమార్టం నిర్వహించామని, రక్త నమూనాలను సేకరించి ల్యాబ్‌లకు పంపించామని... రెండు లేదా మూడు రోజుల్లో వాటి నివేదిక వస్తుందని డాక్టర్ విజయారెడ్డి పందుల పెంపకందార్లకు తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయ్యాక పందులకు వ్యాక్సిన్ వేస్తామన్నారు. పశు వైద్య సహాయకులు వెంకటేష్, ల్యాబ్ టెక్నీషియన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధికి ప్రాధాన్యం

- కౌన్సిల్‌లో చైర్మన్ ప్రవీణ్‌కుమార్



సమస్యలపై చర్చిస్తున్న సభ్యులు

ముమ్మిడివరం: రాజకీయాలకతీతంగా ముమ్మిడివరం నగర పంచాయతీ సమగ్రాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అన్నారు. నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. బళ్ల గేటు సెంటర్ నుంచి హైవేకు వెళ్లే రోడ్డు సర్వే చేయాల్సిందిగా చలానా కట్టి చాలా రోజులైనా ఇప్పటికీ సర్వే చేయలేదని, దీనిపై తహసీల్దార్ ఆదేశాలను కూడా సర్వేయర్ పట్టించుకోలేదని దీనిపై చర్యలు తీసుకోకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వస్తోందని అధికారి పార్టీ కౌన్సిలర్ బొంతు సత్య శ్రీనివాస్ హెచ్చరించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు వివరణ ఇచ్చేందుకు సైతం ఆయా శాఖాధికారులు సమావేశానికి హాజరు కావడం లేదని చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైన అధికారులపై చర్యలకు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని చైర్మన్ ప్రవీణ్‌కుమార్ కమిషనర్ లోవరాజుకు సూచించారు. ముమ్మిడివరం మెయిన్‌రోడ్డు, విష్ణాలయం సెంటర్, , పెద్ద వంతెన వద్ద తాగునీరు ప్రధాన పైపు లైన్ లీకై నెల రోజులుగా నీరు వృథాగా పోతోందని దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని ప్రతిపక్ష సభ్యులు ములపర్తిబాలకృష్ణ, కడలి సౌజన్య సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వివిధ పనులకు సంబంధించి ప్రవేశ పెట్టిన బిల్లులను సమావేశం ఆమోదించింది. వైస్ చైర్మన్ వేటుకూరి బోసురాజు పాల్గొన్నారు.

పనులు మొదలు పెట్టని కాంట్రాక్టర్లపై చర్యలు

- 15 రోజుల గడువు ఇచ్చి బ్లాక్ లిస్ట్‌లో పెట్టండి
- మున్సిపల్ ఇంజినీర్లకు పాలక పక్షం సూచన



కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, కమిషనర్ నాయుడు

అమలాపురం టౌన్: మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు టెండర్లు ఖరారై నేటికీ పనులు మొదలు పెట్టకుండా జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని పాలక పక్ష కౌన్సిలర్లు ఇంజినీర్లకు సూచించారు. అలాంటి కాంట్రాక్టర్లకు కొంత గడువు ఇచ్చి అప్పటికీ స్పందించకుంటే వారిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ హాలులో శుక్రవారం ఉదయం చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పాలక పక్ష కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని ఇదే అంశంపై చర్చించారు. ఈదరపల్లి బైపాస్ రోడ్డులో బెర్మ్‌ల నిర్మాణం కోసం కాంట్రాక్టర్‌కు టెండర్ ఖరారై వర్క్ ఆర్డరు ఇచ్చి నాలుగు నెలలు కావస్తున్నా ఇంకా పనులు మొదలు పెట్టని వైనంపై కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. అలాంటి కాంట్రాక్టర్లకు 15 రోజులు గడువు ఇవ్వాలని, స్పందించకుంటే బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని డీఈఈ కొత్త అప్పలరాజుకు సూచిస్తూ కౌన్సిల్ తీర్మానం చేసింది.

అంతర్వేది ఉత్సవాలకు మున్సిపాలిటీ సహకారం

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అంతర్వేది ఉత్సవాలకు ఆరుగురు అధికారులు, 60 మంది పారిశుధ్య సిబ్బంది, 200 బస్తాల ముగ్గు, 50 బస్తాల బ్లీచింగ్ పంపించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ప్రతిపక్ష కౌన్సిలర్ తిక్కా సత్యలక్ష్మి ఈ నిధులను స్పెషల్ గ్రాంట్ ద్వారా ఇస్తే బాగుంటుందని సూచించారు. దీనిపై కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, పాలక పక్ష కౌన్సిలర్లు సంసాని బులినాని, మట్టపర్తి నాగేంద్ర వివరణ ఇచ్చారు. పూర్వం నుంచి అంతర్వేది ఉత్సవాలకు మున్సిపాలిటీ నుంచి సిబ్బంది, సామగ్రి పంపించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఇది కలెక్టర్ అధికారిక ఉత్తర్వులతో జరుగుతుందని గుర్తు చేశారు.

పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం

మున్సిపాలిటీ పర్యవేక్షణలో నడుస్తున్న రెండు ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అదనపు తరగతుల నిర్వహణ సమయంలో ఇక నుంచి స్నాక్స్ (అల్పాహారం) ఇవ్వాలని కౌన్సిల్ తీర్మానించింది. గతంలో ఉన్న ఈ విధానాన్ని ఇప్పుడు కౌన్సిల్ ఆమోదంతో పునరుద్ధరించారు.

22.02 శాతమంటే అనుమానించాల్సిందే

అజెండాలోని ముగ్గు, బ్లీచింగ్, ఫినాయిల్ తదితర సామగ్రి సరఫరా కోసం సంబంధిత కాంట్రాక్టర్ అంచనా రేట్లపై 22.02 శాతం లెస్ రేట్లతో కోడ్ చేయడంపై పాలక పక్షం అనుమానం వ్యక్తం చేసింది. అంచనా రేట్లపై ఓ సారి పునఃసమీక్ష చేసుకోవాలని పాలక పక్ష కౌన్సిలర్లు బులినాని, చిట్టూరి పెదబాబు, గొవ్వాల రాజేష్ ఇంజినీర్లకు సూచించారు. అంత శాతం లెస్‌కు వేస్తే ప్రజారోగ్య సామగ్రి సరఫరా ఎలా ఉంటుందోనని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

పందుల మరణాలపై రెండు రోజుల్లో నివేదిక

మున్సిపాలిటీలో వందలాది పందులు ఏందుకు చనిపోతున్నాయో కారణం చెప్పాలని కౌన్సిలర్ బండారు గోవింద్ ప్రశ్నించారు. చనిపోయిన పందులకు పోస్టుమార్టం నిర్వహించామని, రక్త నమూనాలను సేకరించామని ఏడీ వెంకటేశ్వరరావు తెలిపారు. రెండు రోజుల్లో వచ్చే నివేదికలో పందుల మరణానికి కారణం తెలుస్తుందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియ యూత్ ఫోర్స్‌కు కన్వీనర్ల నియామకం

అమలాపురం టౌన్: జిల్లా క్షత్రియ యూత్ ఫోర్స్‌కు సంబంధించి జిల్లాలోని అమలాపురం, ముమ్మిడివరం, రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాలకు కన్వీనర్లను నియమించినట్లు జిల్లా యూత్ ఫోర్స్ అధ్యక్షుడు కొపనాతి వెంకటరాజు తెలిపారు. అమలాపురం పట్టణం సమీపంలోని ఈదరపల్లి ఫిష్ మార్కెట్ కమిటీ బిల్డింగ్‌లో శుక్రవారం జరిగిన జిల్లా యూత్ ఫోర్స్ సమావేశం ఈ నియమాకాలు చేసింది. అమలాపురం నియోజకవర్గం కన్వీనర్‌గా కొప్పాడి వీరాంజనేయులు, రాజోలు నియోజకవర్గానికి కొప్పాడి దుర్గారావు, ముమ్మిడివరం నియోజకవర్గానికి సంగాని బ్రాబ్రో, పి.గన్నవరం నియోజకవర్గానికి షేరు నాగేశ్వరరావు, కొత్తపేట నియోజకవర్గానికి కర్రి సీతారామరాజు నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు వెంకటరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి యూత్ ఫోర్స్ జాతీయ అధ్యక్షుడు నాగిడి సాంబశివరావు ముఖ్య అతిథిగా పాల్గొని నియోజకవర్గాలకు నియమితులైన కన్వీనర్లను అభినందించారు.

డ్రగ్స్ నివారణపై అవగాహన

అల్లవరం: ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు యువత, విద్యార్థులు సహకరించాలని స్థానిక ఎస్సై శ్రీను నాయక్ కోరారు. ఓడలరేవులోని బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో ×యువతా మేలుకో–భవిత మలుచుకో–డ్రగ్స్ వదులుకో₹ అనే నినాదంతో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని భావి తరాలకు అందించడంలో యువత కీలక పాత్ర పోషించాలన్నారు. గంజాయి, హెరాయిన్, కొకైన్ వంటి మత్తు పదార్థులకు యువత దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థులతో ఎన్నో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ఎవరైనా మత్తు పదార్థులు తీసుకున్నా, విక్రయించినా టోల్ ఫ్రీ నంబర్ 14500కు సమాచారం ఇవ్వాలని సూచించారు. బీవీసీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి, అధ్యాపకులు పాల్గొన్నారు.